




ఖమ్మంలో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌లో.. 'జూబ్లీ' జోష్

- ఉప ఎన్నికలో గెలుపుతో హస్తంశ్రేణుల సంబరాలు
- బీఆర్ఎస్, బీజేపీలో నిరుత్సాహం

ఖమ్మం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : త్వరలో స్థానికసంస్థల ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో.. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ఫలితం కాంగ్రెస్‌లో జోష్ నింపగా.. విపక్ష బీఆర్ఎస్, బీజేపీలో నిరుత్సాహాన్ని మిగిల్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగ్గా.. అధికార కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయకేతనం ఎగురవేశారు. దీంతో ఉమ్మడిజిల్లాలోని కాంగ్రెస్ శ్రేణుల్లో విజయానందంలో మునిగితేలారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు పార్టీ ఇన్‌చార్జ్‌లుగా ముగ్గురు మంత్రులు అక్కడే మకాం వేశారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఉపఎన్నిక ప్రకటన తర్వాత హైదరాబాదులోనే మకాం వేసి నియోజకవర్గంలో విస్తృతంగా సమావేశాలు

(మిగతా 6వ పేజీలో)

పామాయిల్ విస్తరించాలి

పచ్చదనం పెరగాలి

- 'గిరివికాస్'తో పోడుభూముల్లోనూ పామాయిల్ సాగుకు ప్రోత్సాహం
- జనవరి నాటికి గోద్రేజ్ పరిశ్రమ ట్రయల్‌రన్ పనులు పూర్తవ్వాలి
- అంజనాపురంలో దేశంలోనే మొదటి సీడ్ గార్డెనింగ్ ఏర్పాటు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఫ్యాక్టరీ నిర్మాణ పనుల పరిశీలన
- జిల్లాలో పర్యటన.. అభివృద్ధి పనులకు శ్రీకారం



గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) / కొణిజర్ల : పామాయిల్ పంట విస్తరించాలని, తద్వారా సామాజిక అడవుల తరహాలో పచ్చదనం పెరగాలని, ఇందులో భాగంగానే ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కొణిజర్ల మండలం అంజనాపురంలో గోద్రేజ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను ఆయన అదనపు కలెక్టర్ శ్రీజ, కంపెనీ ప్రతినిధులు కృష్ణప్రసాద్, చావా వెంకటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంజనాపురంలో గోద్రేజ్ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా ఆయిల్‌పామ్ సీడ్‌గార్డెనింగ్ ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. పత్తిమొక్కజొన్న రైతులు కూడా ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేయాలని తద్వారా జిల్లాపచ్చదనంతో కళకళాడుతూ తద్వారా రైతులు లాభసాటి వ్యవసాయంలో అడుగుపెట్టాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజన రైతులకు గిరివికాసం కింద సోలార్ సదుపాయంతో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గోద్రేజ్ కంపెనీకి ఖమ్మంజిల్లాలో ఆరుమండలాలు, కొత్తగూడెంజిల్లాలో నాలుగు మండలాలను కేటాయించామన్నారు. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి కొణిజర్ల మండలం అంజనాపురంలో సీడ్ గార్డెనింగ్ ఏర్పాటుకు గోద్రేజ్ కంపెనీతో ఎంవోయూ కుదుర్చుకున్నారని, దీనికి అనుగుణంగా ఆకంపెనీకి త్వరలో భూమిని అప్పగిస్తామన్నారు. దేశంలో లక్ష మెట్రిక్ టన్నుల నూనె వినియోగం జరుగుతుండగా అందులో 97శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నదే ఉందని, కేవలం 3శాతం మాత్రమే మనదేశంలో పామాయిల్ సాగువుతుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 3లక్షల ఎకరాల సాగును మరో ఏడాదిలో మరో మూడు లక్షల ఎకరాలకు పెంచబోతున్నామన్నారు. ప్రస్తుతం (మిగతా 6వ పేజీలో)



ఫ్యాక్టరీ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

రామాలయ మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష

- అభివృద్ధి పనులపై హైదరాబాద్‌లో భేటీ
- హాజరైన రెవెన్యూ, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి

భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా రూపొందిస్తున్న మాస్టర్‌ప్లాన్‌పై హైదరాబాద్‌లో శుక్రవారం సమీక్ష జరిగింది. ఈ భేటీకి రాష్ట్ర రెవెన్యూ దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజరామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి హాజరయ్యారు. ఈ సమీక్షకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, ఏఈవో భవానీ రామకృష్ణారావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సమయంలో దేవస్థానం అధికారులతో మాస్టర్‌ప్లాన్ రూపకల్పన ఎలా ఉండాలి? ఎంత వరకు చేయాలి? ఆర్కిటెక్ట్ రూపొందించిన ప్లాన్‌లో మార్పులు ఏమైనా చేపట్టాలా అనే అంశాలపై చర్చించినట్లు వినికిడి. ఆలయ మాస్టర్‌ప్లాన్ రూపకల్పన సమయంలో పాంచరాత్ర ఆగమశాస్త్రానికి అనుగుణంగా వైదిక సిబ్బంది సూచనలు, సలహాలకు ప్రాధాన్యమిస్తూ రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం రామాలయ అభివృద్ధిని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని భావిస్తుండటంతో ఇప్పటికే భూసేకరణ పనులు పూర్తి కాగా సుమారు ఎకరం స్థలంలో దక్షిణం వైపు అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఏఏ పనులు చేపట్టాలి అనే దానిపై అటు అధికారులు, ఇటు వైదిక సిబ్బంది తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తదనుగుణంగానే మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

ఏసీబీ ఆకస్మిక తనిఖీలు

వైరా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతికి సంబంధించి తమకు వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి అనుసంధానంగా పనిచేస్తున్న డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి.. డాక్యుమెంట్ రైటర్ల సెల్‌ఫోన్లు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఒక సీనియర్ డాక్యుమెంట్ రైటర్ వద్ద రూ.2.90లక్షల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే తాను అప్పుగా తీసుకున్న వ్యక్తికి తిరిగి ఇచ్చేందుకు ఆ నగదును తెచ్చానంటూ ఆ డాక్యుమెంట్ రైటర్ తన వద్ద ఉన్న ఆధారాలను ఆయన ఏసీబీ అధికారులకు చూపించినట్లు సమాచారం.ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ వైరా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై పలు ఫిర్యాదులు అందడంతో ఈ తనిఖీలు చేశామని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్ చేయించిన, తయారుచేసిన వాటితో పాటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్లను తనిఖీ చేశామని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్లతోపాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్లలో నగదు బదిలీ యాప్‌లను పరిశీలిస్తున్నామని చెప్పారు.ఈ తనిఖీల వివరాలను త్వరలోనే పూర్తిస్థాయిలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

ఘనంగా సహకార వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సిబ్బంది

ఖమ్మం మార్కెట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం నగరంలోని డీసీసీబీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు జెండా ఆవిష్కరించారు. బ్యాంక్ ఉద్యోగులు అందరూ సహకార బలోపేతానికి, బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తామని ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాకతీయ సహకార శిక్షణా కేంద్రం వరంగల్ వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, సీఈవో వెంకటఆదిత్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో

కవిత పర్యటన



ఖమ్మం చర్చికాంపౌండ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈనెల17,18తేదీల్లో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలవద్దకు వెళ్లి కవితవారి సమస్యలు తెలుసుకుంటారని, 18న ఖమ్మంలో మేధావులు, తెలంగాణ ఉద్యమకారులతో సమావేశమవుతారని తెలిపారు. ఈ సమావేశంలో గట్టుకరుణ, శశిధర్, తదితరులు పాల్గొన్నారు.



వివాహితను హత్యచేసిన ఇంజనీరింగ్ విద్యార్థి అరెస్ట్

హైదరాబాద్‌లో ఘటన

మృతురాలు, నిందితుడిది ఖమ్మం జిల్లానే

జీడిమెట్ల (హైదరాబాద్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఓ వివాహితను గొంతునులిమి హత్యచేసి, ఒంటిమీద బంగారం దోచుకుని సహజ మరణంగా చిత్రీకరించటానికి యత్నించిన యువకుడిని జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని బాలానగర్ డివిజన్ డీసీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఎరిమాల నిహారిక(21), దేవేందర్‌రెడ్డి దంపతులు హైదరాబాద్ జగద్గిరిగుట్ట ప్రాంతంలోని వెంకటేశ్వరనగర్‌లో నివాసముంటున్నారు. దేవేందర్‌రెడ్డి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే ఖమ్మం జిల్లాలోని నిహారిక ఇంటి సమీపంలో ఉండే ఆమెకు వరుసకు సోదరుడయ్యే బొగ్గుల శివమాధవరెడ్డి(23) నగరంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. బెట్టింగులు, మద్యం లాంటి చెడు వ్యసనాలకు బానిసైన శివమాధవరెడ్డికి రూ.7లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పుల వారి ఒత్తిళ్లు ఎక్కువవడంతో తన తల్లి బంగారు గొలుసును రూ.85 వేలకు తాకట్టుపెట్టాడు. కానీ తన గొలుసు కావాలంటూ తల్లి రోజూ ఫోన్ చేస్తుండటంతో నిహారిక బంగారు వస్తువులు దోచుకోవాలని పథకం పన్నాడు. ఈనెల 12న నిహారికి ఇంటికి వచ్చిన శివమాధవరెడ్డి ఆమెతో కలిసి టీవీలో సినిమా చూసి.. ఆ తర్వాత ఆమె మెడకు తాడుతో బిగించి హత్య చేశాడు. సహజ మరణంగా చిత్రీకరించడానికి ఆమె దుస్తులను తొలగించి బాత్రూంలోకి తీసుకెళ్లి.. స్నానం చేస్తూ కిందపడి చనిపోయినట్టు చిత్రీకరించి, ఆమె ఒంటిపైన ఉన్న 4 తులాల బంగారు వస్తువులు తీసుకుని ఇంటి తలుపులు వేసి వెళ్లిపోయాడు. సాయంత్రం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చిన భర్త తన భార్య బాత్రూంలో స్నానం చేస్తూ కిందపడి మృతి చెందిందని భావించా డు. మొదట సహజ మరణంగా కేసు నమోదు చేసిన జగద్గిరిగుట్ట పోలీసులు, పోస్టుమార్టంలో హత్యగా రావడంతో దర్యాప్తు చేసి దొరికిన ఆధారాలతో శివమాధవరెడ్డిని శుక్రవారం అరెస్ట్ చేశారు.

దేశాభివృద్ధికి బాటలు వేసిన నెహ్రూ

తొలి కేంద్ర బడ్జెట్‌లోనే వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చిన చాచా..

ఖమ్మంలో నెహ్రూ జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల



నెహ్రూ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి తుమ్మలకు గులాబీ పూలు అందిస్తున్న బాలురు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు జవహర్ లాల్ నెహ్రూ తీసుకున్న నిర్ణయాలు ఇప్పటికీ ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని అగ్రభాగాన నిలిపాయన్నారు. నగరంలోని నెహ్రూ సెంటర్‌లో శుక్రవారం మాజీ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకల్లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి తొలి ప్రధాని నెహ్రూ ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. మొదటి కేంద్ర బడ్జెట్‌లోనే వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత కల్పించారన్నారు.

అనంతరం స్థానికంగా ఉన్న పిల్లలు ఉత్సాహంగా మంత్రి తుమ్మల వద్దకు చేరుకొని గులాబీ పూలను అందించారు. పిల్లలు ఏమి చదువుతున్నారని అడిగి తెలుసుకుని మంచిగా విద్యాభ్యాసం చేసి మంచి పౌరులుగా ఎదగాలని మంత్రి తుమ్మల చిన్నారులను దీవించారు. అనంతరం నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి ప్రసంగించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో అన్ని కోణాల్లో దేశాభివృద్ధికి బాటలు వేశారన్నారు. నెహ్రూ వారసత్వంగా ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో సకల జనుల కోసం కాంగ్రెస్ పార్టీ విశేషంగా కృషి చేస్తుందన్నారు. సమాజంలోని శ్రమ జీవుల కోసం, భారతదేశ సార్వభౌమాధికారం కాపాడేందుకు కృషి చేసిందన్నారు. అన్ని కులాలు, మతాలు అన్నదమ్ముల వలే కలిసిమెలిసి ఉండేందుకు ప్రజాస్వామ్యయుతంగా పనిచేసిందన్నారు. లౌకిక వాదాన్ని కాపాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగించిందన్నారు. ప్రతీ కార్యకర్త, నాయకులు కాంగ్రెస్ పార్టీ కోసం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కార్పొరేటర్లు లకావత్ సైదులునాయక్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, నాయకులు గజ్జల వెంకన్న, కొప్పెర ఉపేందర్, షేక్ రజ్జీ, తొగరు భాస్కర్, కాటం కోమరయ్య, యాదయ్య, ఎంప రామకృష్ణ, ఉప్పలయ్య, గోనేల రవిశంకర్, కన్నం రమేష్, తుపాకుల మధు, చల్లా రమేష్, బోజెడ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన నెహ్రూ జయంతి వేడుకల్లో మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడారు.

ఖమ్మం నియోజకవర్గానికి మహర్దశ

రూ.27.93 కోట్లతో పది హ్యామ్ రోడ్లు

మంత్రి తుమ్మల కృషితో మంజూరు

త్వరలోనే పనుల ప్రారంభానికి కసరత్తు

ఖమ్మం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఖమ్మం నియోజకవర్గానికి రూ.27.93 కోట్లతో పది హ్యామ్‌రోడ్లు మంజూరయ్యాయి. ఈ పనులు త్వరలోనే ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో హ్యామ్ కనెక్టివిటీ కింద రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. మొత్తం పది రోడ్లకు గాను రూ.27.93 కోట్ల నిధులు మంజూరు కాగా 36.66 కిలోమీటర్లతో ఈ రహదారి పనులు చేపట్టనున్నారు. ఇందులో రఘునాథపాలెం మండల కేంద్రం నుంచి ఎస్టీకాలనీ వరకు 1.15కి.మీ ఆర్అండ్‌బీ రోడ్డుకు రూ.88 లక్షలు, అల్లీపురం నుంచి పుట్టకోట వరకు 2.21 కి.మీ రోడ్డుకు రూ .1.68 కోట్లు, పంగిడి నుంచి విక్రం నగర్ వయా చింతలతండా, ఎన్‌వీబంజర, రజబలీనగర్ వరకు 6.20 కి.మీ రహదారికి రూ.4.72 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వేపకుంట్ల వయా బల్లేపల్లి, బాలపేట మీదుగా చెరువుకొమ్ము తండా వరకు 3.10 కి.మీ రోడ్డుకు రూ.2.36 కోట్లు, జడ్పీ రోడ్డు నుంచి వేపకుంట్ల మీదుగా రఘునాథపాలేనికి రూ.2.75 కి.మీ రోడ్డుకు రూ.2.01 కోట్లు కేటాయించారు. ఖమ్మం, ఇల్లెందు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మంచుకొండ, పంగిడి మీదుగా సూర్య తండా, కొత్రతండా వరకు 10.40 కి.మీ. రూ.7.92 కోట్లు ఖమ్మం కార్పొరేషన్‌లోని గొల్లగూడెం జడ్పీ రోడ్డు నుంచి కొత్తగూడెం మునిసిపల్ పరిధి వరకు 2.65 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.20 కోట్లు, మహిళ ప్రాంగణం నుంచి డైట్‌సెంటర్ నిర్మిత కేంద్రం వరకు 1.50 కి.మీలకు రూ.1.14కోట్లు, ఖానాపురం నుంచి బల్లేపల్లి వరకు 1.40కి.మీ రూ.1.07కోట్లు అగ్రహారం నుంచి శ్రీనివాసనగర్‌కు 5.30కి.మీ. రూ.4.04కోట్లు నిధులు మంజూరు చేశారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ప్రధాన జంక్షన్ల వద్ద రోడ్లపై రంగులతో రాయించండి

ఆర్అండ్‌బీ, మునిసిపల్ రోడ్ల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణను అమలుచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆర్అండ్‌బీ, మునిసిపల్ రోడ్ల నిర్వహణ, మరమ్మతు పనులపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న 20 బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ స్పీడ్‌ను నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్, సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై లైన్ మార్కింగ్ ఉండేలా చూడాలన్నారు. లైన్‌మార్కింగ్ వినియోగం వలన ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని దీనిపై విస్తృత ప్రచారాన్ని కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రధాన జంక్షన్ల వద్ద రోడ్లపై గోస్లో అంటూ తెల్లరంగుతో వేయించాలన్నారు. ఐరాడ్ (ఇంటిగ్రేటెడ్ రోడ్డు అక్సిడెంట్ డిటెక్షన్ సెంటర్) వంటివి పరిశీలించి ప్రమాదాల నియంత్రణకు కార్యచరణ సిద్ధం చేయాలన్నారు. బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ కార్యాచరణ సిద్ధం చేసి నెలరోజుల్లో మార్పు తీసుకురావాలన్నారు. నగరంలో నూతన రోడ్లు వేసేటప్పుడే ఖచ్చితంగా డ్రెయిన్ నిర్మాణ పనులు కూడా చేపట్టాలన్నారు. రోడ్లపై దుమ్ము అధికంగా ఉండడం వలన గాలి నాణ్యత తగ్గుతుందన్నారు. బైపాస్ రోడ్డు దానవాయిగూడెం నుంచి రామన్నపేట ఆర్అండ్‌బీ రోడ్డు కొత్తగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో దానవాయిగూడెంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల జూనియర్ కళాశాల మరమ్మతు పనులకు మంత్రి రూ.3కోట 80లక్షలు కేటాయించారని వాటితో కాంపౌండ్ వాల్ ల్యాండ్ ఫిల్లింగ్, జనరేటర్ ఏర్పాటు స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన వసతులు ఉండేలా భవనంలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకోబు, ఈఈ పవార్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, మునిసిపల్ డీఈ ధరణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై పరిష్కారం

వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ భూసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి శుక్రవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, భూ భారతి దరఖాస్తులు పెండింగ్ సాదాబైనామా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలన్నారు. పలుమార్లు సమావేశాల్లో సూచనలు చేసినప్పటికీ కొన్ని మండలాల్లో ఆశించిన పురోగతిలి లేదని కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. పెండింగ్‌లో దరఖాస్తుల పరిష్కారం వరకు సెలవుల్లో కూడా అధికారులు పూర్తిస్థాయిలో పనిచేయాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిశీలించాలన్నారు. డెస్క్ పరిశీలన ద్వారా అనర్హుల దరఖాస్తులను తిరస్కరించి ఆర్డీవోకు పంపించాలన్నారు. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న దరఖాస్తులను జీపీవో ఆర్ఐ, సర్వేయర్ ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సాదాబైనామా దరకాస్తుల్లో అమ్మకందారుల రికార్డ్ సరిగ్గా లేకపోతే తిరస్కరించాలన్నారు. ప్రభుత్వ భూములు నాళాలు, చెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో భూముల పట్టా కోసం సాదాబైనామా దరఖాస్తులు వస్తే నేరుగా తిరస్కరించవచ్చని వీటిని డెస్క్ పరిశీలన ద్వారా గుర్తించాలని ఈ ప్రక్రియ ప్రతి మండలంలో ఆదివారం నాటికి పూర్తిచేయాలని అన్నారు. ప్రతి భూ సమస్య దరఖాస్తు సంబంధించి తిరస్కరించే కారణాలు స్పష్టంగా తెలియచేయాలని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండలాలను ఆకస్మికంగా తనికీ చేసే సమయంలో తిరస్కరించిన దరఖాస్తులను రాండంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సాదాబైనామా దరఖాస్తులు అసైన్‌మెంట్ దరఖాస్తులు పక్కన పెట్టి మిగిలిన 16వేల దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రతి మండలం పరిధిలో రెండు నుంచి మూడు బయోమెట్రిక్ డివైజ్‌లు పెట్టుకుని త్వరగా పెండింగ్ దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి చేయాలన్నారు. అనంతరం మండలాల వారీగా సాదాబైనామా, రెవెన్యూ సదస్సులు దరఖాస్తు స్క్రూటినీ సమీక్షిస్తూ పలు సూచించారు. ఈ వీడియో సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అమయ్ యాదవ్, వివిధ మండలాల నుంచి తహసీల్దార్లు, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తనికెళ్ల స్త్రీశక్తి టీ దుకాణంలో చోరీ



చోరీ జరిగిన టీ దుకాణం

కొణిజర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తనికెళ్ల మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ఓ స్త్రీ శక్తి టీస్టాల్‌లో శుక్రవారం చోరీ జరిగింది. దీంతో ఆ టీస్టాల్ యజమాని అయిన మాచర్ల అరుణ కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం తనికెళ్లకు చెందిన అరుణ మెయిన్‌రోడ్డు పక్కన పొట్టకూటి కోసం స్త్రీశక్తి టీస్టాల్ పెట్టుకుంది. రోజువారి లాగానే గురువారం రాత్రి వరకు కొట్టును నడిపి ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా దుకాణం తాళం పగులగొట్టి ఉంది. దుకాణంలోని గ్యాస్ బండతోపాటు తినుబండారాలు చోరీ గురైనట్టు బాధితురాలు తెలిపింది. గత మూడు వారాల క్రితం కూడా ఇదే దుకాణంలో చోరీ జరిగిందని, అప్పుడు కూడా గ్యాస్‌బండతో పాటు పలురకాల వస్తువులు అపహరణకు గురైనట్టు వాపోయింది. ఈ మేరకు కొణిజర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కానిస్టేబుల్ వచ్చి టీస్టాల్‌ను పరిశీలించారు. ఇప్పటికే రెండుసార్లు దుకాణలో చోరీ జరగడంతో బాధితు రాలు ఆందోళన వ్యక్తంచేసింది.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ తహసీల్దార్ మృతి

ఆదిరాజు సీతారామారావు మరణం తీరని లోటు : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సీతారామారావు (ఫైల్)

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖలో సుదీర్ఘ కాలం సేవలందించి, పదవి విరమణ పొందిన అధికారి ఆదిరాజు సీతారామారావు(75) శుక్రవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా.. ఖమ్మంకు చెందిన సీతారామారావు ఆర్‌ఐగా, డిప్యూటీ తహసీల్దారుగా, తహసీల్దారుగా పనిచేసి పదవీ విరమణ చెందారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో సుదీర్ఘకాలం పనిచేశారు. ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ పర్యటన సమయంలో ఆర్‌ఐగా పనిచేస్తూ అప్పటి ఐఏఎస్ అధికారులతో శహబాష్ అనిపించుకున్నారు. ఆ తర్వాత ఆయన ఎంతో మంది ఐఏఎస్ అధికారుల వద్ద పనిచేసి జిల్లా అభివృద్ధిలో పరోక్షంగా పాటుపడ్డారు. రిటైర్ అయిన తర్వాత ఆయన కలెక్టరేట్లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి స్వచ్ఛందంగా సహకరిస్తూ పనిచేస్తున్నారు. ఆదిరాజు మృతి తీరని లోటని కలెక్టర్ అనుదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. పదవి విరమణ పొందిన ఉద్యోగి అయిన కీలకంగా ఉంటూ ఉద్యోగులు, అధికారులకు స్వచ్ఛందంగా సహకరించే మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. పదవీ విరమణ అనంతరం గత 10 ఏళ్లుగా ఖమ్మం కలెక్టరేట్లో తన అనుభవంతో సమావేశాల మినిట్స్ రాస్తూ, ఉత్తరప్రత్యుత్తరాలు తదితర అంశాల్లో అధికారులకు ఉద్యోగులకు సహకరిస్తూ అందరి మన్ననలు పొందారని, ఆయన సేవలు మరవలేనివన్నారు. మంచి అనుభవజ్ఞుడైన వ్యక్తిని కోల్పోవడం బాధతో పాటు, తీర్చలేని లోటని కలెక్టర్ అన్నారు. సీతారాములు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ, వారిఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

కాంగ్రెస్‌లో.. 'జూబ్లీ' జోష్

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. ప్రచారాన్ని వ్యూహాత్మకంగా నిర్వహించారు. ఇక ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు కార్పొరేషన్ల చైర్మన్లు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు కూడా ప్రచారం ముగింపు సమయంలో పాలుపంచుకున్నారు. అక్కడ కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో జిల్లాలోని కాంగ్రెస్ వర్గాలు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఖమ్మంతోపాటు నియోజకవర్గ, మండల కేంద్రాల్లోనూ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. మిఠాయిలు పంచుకున్నారు. ఇక ఈ ఉపఎన్నికపై ఎన్నో ఆశలు పెట్టుకున్న బీఆర్ఎస్‌కు తీవ్ర నిరాశే మిగిలింది. మాజీమంత్రి పువ్వాడ అజయ్‌మార్, ఎంపీ వద్దిరాజురవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్‌తోపాటు పలువురు నాయకలు, కార్యకర్తలు ప్రచారంలో పాలుపంచుకున్నారు ఈ ఎన్నికల్లో గెలుపు ద్వారా జిల్లాలోనూ కేడర్‌కు బలమైన సంకేతం ఇవ్వొచ్చని భావించినా అది ఫలించలేదు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి హైదరాబాద్‌లోనూ మంచి పట్టు ఉంది. కానీ జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడం కేడర్‌కు మింగుడు పడటం లేదు. ఆ పార్టీకి బిహార్ ఫలితాలు ఉత్సాహం నింపినా జూబ్లీహిల్స్‌లో చతికిలపడటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన ఎన్డీయే కూటమిగా అభ్యర్థిని నిలిపి ఉంటే ఆశించిన ఓట్లు వచ్చేవన్న చర్చ జరుగుతోంది.

పామాయిల్ విస్తరించాలి.. పచ్చదనం పెరగాలి

(5వ పేజీ తరువాయి)

టన్ను ఆయిల్‌పామ్ ధర రూ.20వేల వరకు ఉందని, టన్నుకు కనీస మద్దతు ధర రూ.25వేలు ఉండాలని, ఈ ధరల విషయమై త్వరలో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయమంత్రులందరం కలిసి ప్రధానికి విన్నవించబోతున్నామన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా కేంద్ర ప్రభుత్వం పామాయిల్‌పై దిగుమతి సుంకాలు తగ్గించడంతో రైతులు నష్టపోతున్నారని తద్వారా ఆయిల్‌పామ్, పత్తి గిట్టుబాటు ధరలు రైతులు కోల్పోతున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా సిద్దిపేటలో 125 టన్నుల సామర్థ్యంతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని పూర్తిచేశామని, త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించబోతున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరిలోపు పెద్దపల్లి, వనపర్తి, సత్తుపల్లి, ములుగు, తదితర జిల్లాలో పామాయిల్ పరిశ్రమలు పూర్తవుతాయని తెలిపారు. గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో 15నుంచి 60మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈఫ్యాక్టరీకూడా జనవరిలో ట్రయల్‌రన్ పూర్తి చేసుకుంటుందని తెలిపారు. గోద్రేజ్ కంపెనీ ఆధ్వర్యంలో రిఫైన్డ్ ఆయిల్‌పరిశ్రమ కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. గిరివికాసం కింద సోలార్‌సదుపాయంతో పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నామని, అటవీ, పోడుభూముల్లో పామాయిల్ సాగు చేయడం ద్వారా పచ్చదనం పెరుగుతుందని తెలిపారు. అంతర పంటలతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని, అకాలవర్షాలు, రాళ్లవానలు, చీడపీడలు, కోతులు, అడవి పందులతో ఈపంటకు నష్టం ఉండదని ఆయన వివరించారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్, జేడీఏ పుల్లయ్య, ఆర్డీవో నరసింహారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు. ఇక శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఖమ్మం నగరంతో పాటు రఘునాథపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఆయన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆర్ఎంపీ వేధింపులతో యువతి ఆత్మహత్య

స్నేహం పేరుతో సెల్ఫీలు... ఆపై పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి

కారేపల్లి మండలం రేలకాయలపల్లిలో ఘటన



సందీప్తి (ఫైల్)

కారేపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్నేహం పేరుతో సెల్ఫీ ఫొటోలు తీసుకు ని.. పెళ్లి చేసుకోవాలని.. లేదంటే ఇద్దరం కలిసి దిగిన ఫొటోలను సోషల్‌మీడియాలో పెట్టి పరువు తీస్తానంటూ ఓ ఆర్ఎంపీ వైద్యుడు పెట్టిన వేధింపులు భరించలేక ఓ యువతి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం రేలకాయలపల్లిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. రేలకాయలపల్లికి చెందిన జర్పుల సందీప్తి(22)కి.. అదే గ్రామంలో ఆర్ఎంపీగా పని చేస్తున్న పనిచేస్తున్న నామ నరేష్‌కు మధ్య కొంతకాలంగా స్నేహం ఏర్పడింది. ఏన్కూరు మండలానికి చెందిన నరేష్ కొన్నేళ్లుగా రేలకాయలపల్లిలో ఉంటున్నాడు. అవివాహితుడైన నరేష్. సందీప్తితో స్నేహం ఏర్పడిన క్రమంలో పలు సందర్భాల్లో ఆమెతో కలిసి సెల్ఫీ ఫొటోలు తీసుకున్నాడు. ఆ తర్వాత ఆ ఫొటోలను అడ్డుపెట్టుకుని తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే ఇద్దరం కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేసి పరువు తీస్తానంటూ వేధించడం ప్రారంభించాడు. ఈ విషయంపై వారంరోజుల క్రితం యువతి తన తల్లిదండ్రులతో కలిసి ఆర్ఎంపీ వైద్యుడిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుతో గ్రామం నుంచి పరారైన ఆర్ఎంపీ మళ్లీ గ్రామానికివచ్చి సందీప్తి వెంట పడటం, పెళ్లి చేసుకోవాలని వేధించడం అయితే నరేష్ తనవెంట పడుతుండటం గురించి గ్రామంలో అందరికీ తెలిసిందని, దాంతో తన కుటుంబం పరువు పోయిందని భావించిన సందీప్తి శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. యువతి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో ఆర్ఎంపీ వైద్యుడు నరేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ గోపి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా.. మంగలిబండ తండాకు చెందిన దరావత్ రామోజి (69) కూలి పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 2వ తేదీన ఇంటి ముందున్న మట్టిపై జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతన్ని ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుత్రికి తరలించారు. అనంతరం మరుగైన వైద్యంకోసం మమతా ఆసుపత్రికి తరలిచారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య లాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

ఖమ్మం లీగల్‌నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం పట్టణంలోని ఖానాపురం హవేలి ప్రాంతానికి చెందిన మునుగోటి శంకర్ 45కి చెల్లని చెక్కు కేసులో నిందితునికి ఏడాది జైలుశిక్షతో పాటు ఫిర్యాదికి రూ.2.25 లక్షల నష్టపరిహారం కింద చెల్లించాలని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఖమ్మం పట్టణం ప్రశాంతినగర్ కు చెందిన ఫిర్యాది వట్టికొండ పూర్ణ చంద్రరావు వద్ద నిందితుడు తన కుటుంబ, వ్యాపార అవసరాల నిమిత్తం 2021 జూన్ 1న రెండు లక్షల రూపాయలు అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీ నోటును నిందితుడు ఫిర్యాదుకి రా యించి ఇచ్చాడు. అనంతరం ఫిర్యాది తన రుణాన్ని తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా 2022 ఫిబ్రవరి 22న 2.25 లక్షలకు చెక్కు నిందితుడు ఫిర్యాదుకి జారీ చేయగా అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమ చేశాడు. కానీ నిందితుడి ఖాతాలో సరిపడా నగదు లేనందున తిరస్కరణకు గురి అయినది. తరువాత ఫిర్యాది తన న్యాయవాదు లు ముప్వా నాగేశ్వరరావు, తెల్లాకుల రమేష్‌బాబుల ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి సాక్షలను విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

నేడు ప్రత్యేక లోక్‌అదాలత్

ఖమ్మంలీగల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశానుసారం పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికై నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్‌అదాలత్ జరగనుంది. న్యాయసేవా కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకోసం కావాల్సిన ఏర్పాట్లు అన్నిటిని ఇప్పటికే పూర్తి చేశారు.

వరకట్న వేధింపులకు మహిళ ఆత్మహత్య

భర్త, అత్తపై కేసు నమోదు

కల్లూరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండలం పెద్దకోరుకొండి గ్రామంలో ఓ మహిళ వరకట్న వేధింపులకు తాళలేక గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దకోరుకొండి గ్రామానికి చెందిన బండి నాగమణి(26) ఇంట్లో ఎవరు లేని సమయంలో భర్త బండి శ్రీను, అత్త తిరుపతమ్మల వేధింపులకు తాళలేక మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందినది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కల్లూరు పోలీసులు వారిద్దరిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశారు. ఘటన స్థలాన్ని కల్లూరు ఏసీపీ ఏ.రఘు, సీఐ ముత్తులింగం, ఎస్ఐ డి.హరితలు సందర్శించి సమగ్ర వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.







రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గారికి జన్మదిన శుభాకాంక్షలు

ఏజెన్సీ తలరాత మార్చిన తుమ్మల



భద్రాద్రికి శ్రీరామరక్షగా నిలుస్తున్న కరకట్ట



పూసూరు ఏటూరు నాగారం మధ్య నిర్మించిన గోదావరి వారధి

- భద్రాద్రికి రక్షణ కవచంగా నిలుస్తున్న కరకట్ట
- అటు శబరి, ఇటు తాలిపేరుపై వారధులు తుమ్మల చలవే
- ఆయన హయాంలోనే అభివృద్ధిలో ఏజెన్సీ పరుగులు


భద్రాచలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి ఏజెన్సీ తలరాతను మార్చిన మరో విధాత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. గత నాలుగు దశాబ్దాల ప్రజా జీవితంలో రాజకీయాలకు అతీతంగా భద్రాద్రి ఏజెన్సీని అభివృద్ధి చేసి తన మార్కును చాటుకున్నారు. ముఖ్యంగా దశాబ్దాల కాలంగా ముంపునకు గురవుతున్న భద్రాద్రి పుణ్యక్షేత్రాన్ని వరద ముంపు నుంచి కాపాడేందుకు గోదావరి కరకట్ట నిర్మాణంకు దోహదపడ్డారు. దీంతో 2022 జూలై 16న వచ్చిన మహా గోదావరి వరదల సమయంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 71.3 అడుగులు వచ్చినా భద్రాద్రికి గోదావరి కరకట్ట రక్షణ గోడగా నిలిచిందని భద్రాద్రి వాసులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. అలాగే నాడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మమేకమై ఉన్న కూనవరం- వరరామచంద్రాపురం కలుపుతూ వారధిగా ఉన్న శబరి బ్రిడ్జిని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాదు చర్ల మండలంలో తాలిపేరు వద్ద వారధి నిర్మించడంతో ఏజెన్సీ వాసుల కష్టాలు తొలగాయి. అలాగే వాజేడు మండలంలో పూసూరు వారధి నిర్మాణం చేయడంతో నేడు వాజేడు, వెంకటాపురం మండలాలకు మహర్దశ పట్టింది. ఈ విధంగా భద్రాచలం ఏజెన్సీలో మౌలిక విద్య, వైద్య సదుపాయాలు, వసతులు, రహదారులు, వారధులు ఇలా ఒకటేంటి ఎన్నో ఎన్నింటికో శ్రీకారం చుట్టి నిర్మించి ఏజెన్సీ ప్రాంతవాసుల గుండెల్లో చిరస్థాయిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిలిచిపోయారు.


భద్రాచలం అభివృద్ధి తుమ్మల చలవే..

భద్రాద్రి అభివృద్ధి జరిగిందంటే అది మంత్రి తుమ్మల చలవే. రామాలయ అభివృద్ధి, వరదల ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కోసం భద్రాద్రికి వరద కరకట్ట నిర్మాణం, వంద పడకల ఆసుపత్రి, పట్టణంలో మంచినీటి సదుపాయం, రహదారుల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు లాంటివి చేశారు. తుమ్మల సంకల్పంతోనే భద్రాద్రి వద్ద రెండో వారధికి బీజం పడగా రెండేళ్ల క్రితం శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా తరలొచ్చే భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ఆ వారధులతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

గతంలో భద్రాచలం ఏజెన్సీలో రాకపోకలు సాగించాలంటే వరదల సమయంలో కష్టాలు, నష్టాలు అన్నీ ఇన్నీ కావు. నాడు 1997లో గోదావరి వరదల సమయంలో చర్ల మండలం తేగడ వద్ద తాలిపేరు నుంచి వదిలిన వరద నీటిలో పడవ మునగడంతో 23 మంది మృత్యువాతపడ్డారు. ఈ సంఘటన ఆనాడు మంత్రి తుమ్మలను కలిచివేసింది. ప్రతి ఏటా వర్షాకాలం వరదల సమయంలో ప్రజలు ముఖ్యంగా ఎగువన ఉన్న చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడేవారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఎన్నో వారధులకు శ్రీకారం చుట్టి వాటిని పూర్తి చేసిన ఘనత ఆయనదే. ఇదిలా ఉండగా.. వాజేడు మండలంలోని పూసూరు- ఏటూర్నాగారం మండలంలోని ముల్లెకట్లను కలుపుతూ గోదావరిపై నిర్మించిన వారధి ఏజెన్సీవాసులకు వరమైంది. అలాగే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రయాణం సాగించేందుకు కల్లేరు-మోటు మధ్య బ్రిడ్జి నిర్మాణానికి నాడు తుమ్మల నాగేశ్వరరావు ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడడంతో.. ఆ ప్రయత్నం సత్ఫలితాలనిచ్చింది.

























ఘనంగా బాలల దినోత్సవం



విన్‌ఫీల్డ్‌లో..



న్యూవిజన్ పాఠశాలలో..





నేతాజీ వేషధారణలో చిన్నారి, హార్వెస్ట్‌లో..

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని శుక్రవారం నగరంలోని పలు విద్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. నగరంలోని న్యూవిజన్, హార్వెస్ట్, స్మార్ట్‌కిడ్జ్, న్యూఇరా, రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీ, సర్వజ్ఞ, త్రివేణి పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల డైరెక్టర్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పలు రకాలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.స్మార్ట్ కిడ్జ్‌లో జరిగిన వేడుకలుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీరామ్ మాట్లాడుతూ సమాజ నిర్మాణం తరగతిగదిలోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను స్వేచ్ఛగా వివక్షత రహితంగా పెంచాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు గుడ్ టచ్ బాడ్ టచ్ లపై అవగాహన కల్పించి ప్రవర్తించే విధానాన్ని నేర్పాలని కోరారు.

గాయత్రి మానసిక దివ్యాంగుల కేంద్రంలో రక్తదానం

ఖమ్మంస్పోర్ట్స్: బాలలదినోత్సవం సందర్భంగా తలసీమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం శుక్రవారం సహకార నగర్‌లోని గాయత్రి మానసిక దివ్యాంగుల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 30మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అభినవ్ హైస్కూల్ కరస్పాండెంట్ పారుపల్లి అరుణకుమారి రక్తదానం చేయడమే కాకుండా మానసిక దివ్యాంగుల కేంద్రానికి నిత్యావసర సరుకులు అందచేశారు. కార్యక్రమంలో పారుపల్లి అభినవ్, మానసిక దివ్యాంగుల కేంద్రంనిర్వాహకులు చట్టు నందిని,లక్ష్మీనారాయణ, సైదులు, మంజుల, వెంకటేష్, ఉపేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.



స్మార్ట్‌కిడ్జ్‌లో..



న్యూఇరాలో..



రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీలో..



సర్వజ్ఞలో..



శ్రీకృష్ణప్రసాద్ పాఠశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న నిష్కాశర్య



త్రివేణిలో..



తెలంగాణ విద్యారణ్య పాఠశాలలో..



రక్తదానం చేస్తున్న యువత



పామాయిల్ రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వ్యవసాయశాఖ మంత్రి పొలంబాట

- పామాయిల్ క్షేత్రంలో రైతులతో తుమ్మల మమేకం
- రఘునాథపాలెం మండలంలో పర్యటన

రఘునాథపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరాలు,పట్టణాలను వదిలి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మారుమూల గిరిజన ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రంలోని రైతులతో మమేకమయ్యారు. గిరిజన రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మంత్రిగా కాకుండా సాధారణ రైతుగా రైతులను పలకరించారు. ఇదంతా రఘునాథపాలెం మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన రజాబ్‌ఆలీనగర్ గ్రామంలో చోటుచేసుకొంది. మంత్రి తుమ్మల శుక్రవారం ఈర్లపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మాణం చేయనున్న అంతర్గత రహదారులకు శంకుస్థాపన చేశారు. పంగిడిలోను ఎస్సీకాలనీలోని రహదారులకు మరో రూ.20 లక్షలతో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా రఘునాథపాలెం మండలాన్ని అభివృద్ధి జరుగుతుందన్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా నూరు శాతం సాగునీరు అందుతుందన్నారు. గిరిజన పిల్లలకు మంచి జాతీయస్థాయి విద్యా ప్రమాణాలు కలిగిన స్వామినారాయణ పాఠశాలను అందుబాటులోకి వస్తోందన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేశారు. అటవీహక్కుపట్టాలు పొందిన రైతులకు సంపూర్ణంగా సాగు భూములపై హక్కులు, సాగునీటికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏసీఎల్‌పీ శ్రీజ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారిపుల్లయ్య, మండల కాంగ్రెస్ కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

18న నాయీ బ్రాహ్మణుల వనమహోత్సవం

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఈనెల18న జరిగే నాయీబ్రాహ్మణ వనసమారాధన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయీబ్రాహ్మణ సేవాసంఘం ఐక్యవేదిక నగర అధ్యక్షుడు యలమందల జగదీష్, ఉద్యోగసంఘం నాయకుల దేవరకొండ సైదులు కోరారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం నగరంలోని చెరుకూరి వారి మామిడితోటలో జరిగే ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణులందరు పాల్గొనాలని కోరారు. ఈసమావేశంలో కొలిపాక బాబురావు, జిడుగు వెంకటరామకృష్ణ, నంద్యాల నరసింహారావు, రావులపాటి శ్రీనివాస్, సూత్రాల శ్రీనివాస్, దోమకొండ నాగేశ్వరరావు,తుపాకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి

సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు

ఖమ్మంఅర్బన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పట్టించుకోక పోతుండటంతో పరోక్షంగా వారి బలవన్మరణాలకు కారణం అవుతోందని ఆరోపించారు. ఈనెల 7న చలోహైదరాబాద్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామని, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచన మేరకు వాయిదా వేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణయ్య, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మైసా నాగయ్య, జిల్లాప్రధాన కార్యదర్శిఎం. సుబ్బయ్య, తదితర 14 యూనిట్ల సభ్యులు పాల్గొన్నారు.

చరిత్రలో గుర్తుండేలా శతాబ్ది ముగింపు సభ

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): చరిత్రలో నిలిచిపోయేలా ఖమ్మం నగరంలో సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల సభ జరుగుతుందని, 10 లక్షల మందికి పైగా జన సమీకరణ జరుగుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. వందేళ్ల చరిత్రను నేటి యువతకు తెలిసేలా ముగింపు సభ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో జనసేవాదళ్ శిక్షణ కార్యక్రమాన్ని బాగం హేమంతరావు ప్రారంభించారు. డిసెంబరు26న జరిగే ప్రదర్శనలో 10వేల మంది జనసేవాదళ్ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 21న జాతీయ, రాష్ట్రస్థాయి జాతాలు ఖమ్మంలో పర్యటిస్తాయన్నారు. సూర్యాపేటలో ప్రారంభమైన జాత ఈనెల 21న నేలకొండపల్లిలోకి ప్రవేశిస్తుందన్నారు. ముదిగొండ, ఖమ్మం, కొణిజర్ల, వైరా, తల్లాడ, ఏన్కూరు మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక కళాజాతాలను ఏర్పాటు చేశామన్నారు. సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించి పెద్ద ఎత్తున అవగాహన, ప్రచారం జరుగుతుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం వరకు అనేక ఉద్యమాలను గుర్తు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధినేని కర్ణకుమార్,ఎస్‌కే జానీమియా, ఏనుగు గాంధీ, నానబాల రామకృష్ణ, మామిళ్ల శ్రీనాథ్, మద్దోజు శ్రావణ్, చింతల రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా మహా దీపోత్సవం

హాజరైన జిల్లా న్యాయాధికారి రాజ్‌గోపాల్ దంపతులు



ఆశీర్వాదం తీసుకుంటున్న న్యాయాధికారి దంపతులు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం నగరంలోని స్తంభాద్రి లక్ష్మీ నరసింహాస్వామిఆలయం(గుట్ట)ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో మహా దీపోత్సవం నిర్వహించారు. జిల్లా న్యాయాధికారి రాజ్‌గోపాల్ దంపతులు హాజరయ్యారు. దీపోత్సవంలో పాల్గొని అనంతరం లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదతో స్వాగతం పలికారు.



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

పల్లె పల్లెకు ముదిరాజ్ జెండా ఎగరాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): పల్లెపల్లెకు ముదిరాజ్ జెండా...ముదిరాజ్ ఆత్మగౌరవ అజెండాను ఎగుర వేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభరాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటనర్సయ్య, రాష్ట్రనాయకులు కాశబోయిన అనంతరాములు పేర్కొన్నారు. నవంబరు 21న తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వవార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం సంఘం కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పిట్టల నాగేశ్వరరావు, రావుల హనుమంతరావు, నల్ల శేషయ్య, రాంబాబు పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్షలో మహిళా పెన్షనర్లు



ఖమ్మంఅర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ ఖమ్మం కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న రిలేనిరహార దీక్షలు నాలుగోరోజు కొనసాగాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో మహిళా రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. ఐద్వా రాష్ట్ర నాయకులు బుగ్గవీటి సరళ, బండి పద్మ, మెరుగు రమణ, దీక్ష శిబిరాన్ని సందర్శించి ప్రసంగించారు. పెన్షనర్ల సమస్యల పట్ల ప్రభుత్వం ఇకనైనా దృష్టిసారించాలన్నారు. నాలుగు రోజులుగా రిలే దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవటం శోచనీయం అన్నారు. దీక్షల్లో మహిళా పెన్షనర్లు సీహెచ్ చిట్టెమ్మ, కె.రాములమ్మ, పి.విజయలక్ష్మి, కె.శైలజ,జి.భవాని, ఇల్లెందుల సుశీల,ఎం.ఉషారాణి,వై.శైలజపాల్గొన్నారు.

సీపీఐ సానుభూతిపరురాలి మృతి

తిరుమలాయపాలెం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంకు చెందిన సీపీఐ సానుభూతిపరురాలు కొమ్ము బాలమ్మ(80) శుక్రావరం మృతిచెందింది. కొంకతాలంగా అనారోగ్యంతో మృతిచెందింది ఆమెకు ఇద్దరుకుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆమె మృతదేహాన్ని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొమ్ము శ్రీను, బీఎస్పీనాయకులు సీహెచ్‌నాగేశ్వరరావు, పూలే, సీపీఎంనాయకలు కె.స్వామి నివాళులర్పించారు.

కేజీబీవీలో రాత్రి విధులు రద్దు చేయాలి

ఖమ్మం అర్బన్ నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో ఎకౌంటెంట్లకు కేటాయించిన నైట్ డ్యూటీలు రద్దు చేయాలని కేజీబీవీ నాన్‌టీచింగ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆవుల అశోక్, నాయకులు రాధమ్మ జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైనీకి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నూతన డీఈవోను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సుధ, తార, జ్యోతి, స్వప్న, జ్యోఇ కృష్ణవేణి, ఉష, మాధవి, లక్ష్మి, జహీరా, వసంత, నాగమణి, దుర్గ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య



ఖమ్మంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని సింహాద్రినగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం, బాసిత్‌నగర్‌కు చెందిన ధారావత్ బాలాజీ(38) ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో స్పెషల్ బ్రాంచ్ వింగ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య శిరీష, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కొంతకాలం క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో బాలాజీ తలకు బలమైన గాయమైంది. దీంతో కొంతకాలంగా ఇంటివద్దే ఉంటున్నాడు. అయితే శుక్రవారం భార్య, పిల్లలు ఇంట్లో లేని సమయంలో బాలాజీ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఫ్యానుకు వేలాడుతున్న బాలాజీని చూసి విలపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ రాజు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రెవెన్యూ విభాగానికి తిరిగి ఆర్వో, ఇతర ఉద్యోగులు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో గతంలో పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొని ఇతర మునిసిపాలిటీలకు వెళ్లిన ఉద్యోగులు మూకుమ్మడిగా తిరిగి ఖమ్మం నగర పాలక సంస్థకు రానున్నారు. సీడీఎంఏ కమిషనర్ శ్రీదేవి శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్వోగా పని చేసిన జీ.శ్రీనివాసరావు, ఆర్ఐగా బాధ్యతలు నిర్వహించిన సుధాకర్ తిరిగి ఖమ్మానికి రానున్నారు. కొత్తగూడెం ఆర్వోగా విధులు కేటాయించి పరకాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న కే వరలక్ష్మి కూడా ఖమ్మానికి బదిలీ జరిగింది. ఖమ్మంలో బాధ్యతలు నిర్వహిస్తున్న బుచ్చిబాబును సూర్యాపేటకు బదిలీలు జరిగాయి.

కష్టపడితే ఏదైనా సాధ్యమే

న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కల్పన

ఖమ్మంలీగల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కష్టపడితే ఏదైనా సాధ్యమేనని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జ్ ఎం. కల్పన అన్నారు. శుక్రవారం ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లలోని కస్తూర్బా గాంధీబాలికల విద్యాలయంలో జరిగిన బాలల దినోత్సవంలో మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సమాజంలో మంచి గుర్తింపు పొంది తల్లిదండ్రులకు మంచిగుర్తింపు తేవాలని సూచించారు.



మాట్లాడుతున్న కల్పన

డీఎల్ఎస్ఏ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ తొలి ప్రధానమంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాల దినోత్సవం జరుపుకుంటామని వివరించారు.

కాంగ్రెస్ విజయోత్సవం

ఖమ్మంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డు, నాయుడుపేట, పల్లెగూడెం, ఆరెంపుల తదితర గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మద్ది వీరారెడ్డి, మద్ది మల్లారెడ్డి,వెంకటరెడ్డి, బండి జగదీష్, వీరభద్రం, పంతులు నాయక్, అప్పారావు, చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీవిజయం సాధించడం పట్ల శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. తిమ్మక్కపేట,పాతర్లపాడు, తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈకకార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్, చీకటిశ్రీను, సుధాకర్‌రెడ్డి, ఉన్నం రాజశేఖర్, పోట్లకిరణ్, పత్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

ఖమ్మంబైపాస్‌రోడ్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) బిహార్‌రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఖమ్మం నగరంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం జడ్పీ సెంటర్‌లో టపాసులు కాలుస్తూ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరి మాట్లాడుతూ బిహార్ ఎన్నికల ఫలితాలు జిల్లా కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపాయన్నారు. అనంతరం రాష్ట్ర పార్టీ కోశాధికారి దేవకి వాసుదేవరావు మాట్లాడుతూ ఓటుదోపిడీ అంటూ చేసే అబద్దపు ప్రచారాలు, భయపెట్టే వ్యాఖ్యలు ఎక్కడా పని చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బండారునరేష్, రవిరాథోడ్, కార్యదర్శులురజినిరెడ్డి, మంద సరస్వతి, డోకుపర్తి రవీందర్, సురేస్, బోయినపల్లి రవి గౌడ్, చంద్రశేఖర్, మణి పాల్గొన్నారు.



సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఘనంగా బాలల దినోత్సవం


మధిర మడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని అన్నీ మండల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో స్వయంపాలన నిర్వహిస్తూ విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి స్కూల్ నిర్వహణలో భేష్ అనిపించుకున్నారు. అలాగే పలు విద్యాలయాల్లో విద్యార్థులు దేవుళ్లు, పలు వృత్తులు, సామాజిక మాధ్యమాలు తదితర విచిత్ర వేషధారణ, నృత్యాలు, గల్పికలను ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కాకర్లపల్లిలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులే స్వయంగా బోధించడంతో వారిలోని అంతర్గత నైపుణ్యాలను పెంపొందించుకోవడంతోపాటు స్టేజీ ఫియర్‌ను పోగొట్టుకోవడం మంచి పరిణామమన్నారు.



కల్లూరులోని తెలంగాణ గ్రామర్ స్కూల్లో నెహ్రూ వేషధారణలో చిన్నారులు


సత్తుపల్లిలోని కాకర్లపల్లి హైస్కూల్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు


వెంకటాపురం పాఠశాలలలో ఉపాధ్యాయురాలిగా విద్యార్థిని


నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న భూమేశ్వరరావు


ముదిగొండలో చిన్నారులతో కేక్‌కట్ చేయిస్తున్న ఎస్ఐ హరిత


కారేపల్లి బ్రిలియంట్ స్కూల్లో దేశనాయకుల వేషధారణలో చిన్నారులు


తల్లాడలో విచిత్ర వేషధారణలో చిన్నారులు

గుడిపాడు శివాలయంలో తుమ్మల పూజలు

సత్తుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడులో కొలువుదీరిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపాలు వెలిగించి దీపోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, కొల్లి నరసింహారావు, నున్నా రత్నాకర్, గాదె చెన్నారావు పాల్గొన్నారు.


శివాలయంలో దీపం వెలిగిస్తున్న మంత్రి

చిత్తడి నేలల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

- అధికారులకు అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశాలు
- పైలెట్ ప్రాజెక్టుగా చింతకాని మండలం ఎంపికైందని వెల్లడి

చింతకాని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలను గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. చింతకాని మండలం మత్కేపల్లి గ్రామ తుమ్మలమ్మ చెరువును వెట్ ల్యాండ్ కమిటీ సభ్యులతో కలసి ఆయన శుక్రవారం పరిశీలించారు. చిత్తడి నేలలు గుర్తించడం ద్వారా భూమి యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లో మారదని, రైతులు, భూ యజమానులు ఎవరు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ భూములు సంరక్షణ కొరకు 2017 సంవత్సరంలో ప్రభుత్వం కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టిందన్నారు. చింతకాని మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ముందస్తుగా చిత్తడి నేలలు గుర్తించి అక్కడ పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నీటి వనరుల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సమీపంలో తడి భూములను గుర్తిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా చెరువు మ్యాప్, సరిహద్దులను గుర్తించారు. జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, నీటి పారుదల శాఖ అధికారి వెంకట్రామ్, తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

మిరపలో తెగుళ్ల నివారణపై అవగాహన

ఎర్రుపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీనవోలు గ్రామంలో మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి, నాగస్వామిలు పర్యటించి మిరప పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా మిరప రైతులకు పలు సలహాలు, సూచలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మిరపలో ఎండుతెగులు, నల్లతామర పురుగు ఆశించినట్టు గుర్తించామన్నారు. ఎండు తెగులు సోకిన మొక్క పైభాగం లేత పసుపు రంగులోకి మారి ఎండిపోతుందని, ఎండిన మొక్కను తక్షణమే పీకి వేరుచేయాలన్నారు. ఈ తెగుళ్ల వల్ల కొమ్మలమీద గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయన్నారు. తర్వాత పూత మీదకు వచ్చి పూత రాలిపోతుందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 2.5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. నల్లతామర పురుగులు ఆకుల అడుగుభాగాన గుడ్లుపెట్టే ఆకులు, పూత, కాయలో రసంపీల్చివేస్తున్నందున ఎకరానికి 10-15నీలిరంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏవో సాయిశివ, ఏఈవోలు పాల్గొన్నారు.

సత్తుపల్లి సబ్‌డివిజన్‌కు వరి విత్తనాలు

సత్తుపల్లిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో రైతుల కోసం సత్తుపల్లి సబ్ డివిజన్‌కు 150క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. యాసంగిలో రైతుల కోసం జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్ఎఫ్ఎస్ఎన్ఎం) కింద 50శాతం రాయితీపై వరి విత్తనాలను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చేతులమీదుగా రైతులకు పంపిణీ చేశారు. సత్తుపల్లి సబ్ డివిజన్‌లో రైతులకు తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్ 15048) రకం కేజీ రూ.46.60కాగా రూ.25కేజీల బ్యాగ్‌ను రూ.20సబ్సిడీతో రూ.26.60కే అందించనున్నారు. పెనుబల్లికి 30క్వింటాళ్లు కాగా వేంసూరు, సత్తుపల్లికి 60క్వింటాళ్లు చొప్పున మొత్తం 150క్వింటాళ్లు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరెడ్డి, 5మండలాల ఏఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న దయానంద్

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఏన్కూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు భూక్యా వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కమిటీ సమావేశం బానోతుబాలాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి10వేలు రూపాయలు ఇవ్వాలన్నారు. ఏన్కూరు మండలంలో పత్తి, మిర్చి ఎక్కువగా సాగుచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, పార్టీ మండల కార్యదర్శి దొంతబోయిన నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ భూక్యాలక్ష్మా, మండల కమిటీసభ్యులు ఏర్పుల రాములు, ఇటుకల లెనిన్ తదితరులు పాల్గొన్నారు

కల్లూరులో ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశ వేడుకలు

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని పుల్లయ్యబంజర వీధిలో శుక్రవారం జరిగిన ఇందిరమ్మ గృహ ప్రవేశ వేడకలు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుల్లయ్యబంజర వీధికి చెందిన రేమల్ల ప్రసాద్, సుగుణలు ఇందిరమ్మ గృహ లబ్దిదారులు కాగా వారు తమ గృహాల నిర్మాణం పూర్తి చేసుకోగా, వాటిని చందర్‌రావు సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా గృహ ప్రవేశ లబ్ధిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుసునూరు బాల నాగేశ్వరరావు, కుంచాలగురవయ్య, ఎదుళ్ల రాజేష్, బొడ్డు తిరుపతరావు, బొల్లం ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

ఏన్కూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సొసైటీ ఛైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. సహకార వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘాలు పల్లెలకు పట్టుకొమ్మలని అన్నారు. సంఘాల ద్వారా రైతులకు ఎరువుల, విత్తనాలు పంటరుణాలు పంపిణీ చేయడం జరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో నాగలక్ష్మి, మార్కెట్ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరాంనాయక్, సొసైటీ డైరెక్టర్లు అమరనేని కోటేశ్వరమ్మ, గామాలోత్ భామన, మార్కెట్ మాజీ ఛైర్మన్ లాలునాయక్ పాల్గొన్నారు.

పాఠశాలల బాధ్యత మాదే: డాక్టర్ దయానంద్

సత్తుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి బాధ్యత తమదేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. మండలంలోని తోగ్గూడెం, బాసారాం, కొమ్ముగూడెం గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఈడీ టీవీలు, కుర్చీలు, చాపలను ఉచితంగా పంపిణీచేశారు. అభివృద్ధిలో వెనుకబడిన గ్రామాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, పాఠశాలల అభివృద్ధికి దాతలు సైతం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, సత్తుపల్లి ఎంఈఓ నక్కా రాజేశ్వరరావుతో కలిసి మధ్యాహ్న భోజనంలో పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ మధిర డీఈగా శ్రీనివాసరావు

మధిర రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధిర విద్యుత్‌శాఖ డీఈగా బండి శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాలను అనుసంధానం చేస్తూ మధిర డివిజన్ కేంద్రంగా నూతనంగా ఏర్పడిన డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయం డీఈగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఈ అనురాధతోపాటు ఐదుమండలాల ఏఈలు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు.

బారసాల సందర్భంగా పాఠశాలకు సామగ్రి వితరణ

తల్లాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మనుమడి బారసాల సందర్భంగా తల్లాడ మండలం పినపాకలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల సామాగ్రిని పంపిణీ చేశారు. శుక్రవారం తమ మనుమడు బారసాలసందర్భంగా పుల్లెలుగుల శ్రీనివాసరావు, ప్రేమలత దంపతులు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, ప్యాడ్లు పంపిణీచేశారు.

కల్లూరులో ముగిసిన అయ్యప్పల అన్న ప్రసాద కార్యక్రమం

- 30 రోజులపాటు సాగిన అన్నదానం

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో దాతల, భక్తుల ఆర్థిక వితరణ, సహకారంతో గత 30 రోజులు పాటుగా సాగిన అయ్యప్పస్వాముల అన్న ప్రసాద కార్యక్రమం శుక్రవారం నాటితో వియజవంతంగా ముగిసింది. స్థానికంగా మధిర రహదారి వైపున గల నాగుబండి శ్రీనివాసరావు బహుళ అంతస్థుల భవనంలో ఈ అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. కల్లూరు మాజీ సర్పంచి సర్గీయ పసుమర్తి పద్మవతి జ్ఞాపకార్థంగా వారి కుమార్తె, అల్లుడు సత్యశ్రీ బి రమేష్, మరో దాత చిత్తులూరి నరేష్‌లు అన్న ప్రసాద వితరణ చేయగా ఈ కార్యక్రమాన్ని ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప మాలధారులు ఆళ్లా వెంకటేశ్వరరావు, గడ్డి నరేష్, ఏనుగు అంజి, ఆర్యవైశ్య ప్రముఖులు చారుగుండ్ల అచ్యుత సీతారామారావు, శ్రీనివాసరావు, గురవయ్య పాల్గొన్నారు.

సీఎం కృషితోనే జూబ్లీహిల్స్‌లో విజయం

- సత్తుపల్లిలో కాంగ్రెస్ పార్టీ సంబరాలు


విలేకరులతో మాట్లాడుతున్న మట్టా దయానంద్

సత్తుపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితోనే జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల విజయం సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. 24729ఓట్ల మెజార్టీతో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం స్థానిక రింగ్‌సెంటర్‌లో బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం కోసం రాష్ట్రమంత్రులు బాధ్యతలు చేపట్టడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజల వద్దకు వెళ్లామని, అక్కడి ప్రజలు ఇంత పెద్ద ఎత్తున కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పట్టడం అభినందనీయమన్నారు. రాబోయే అన్ని ఎన్నికలలో కూడా ఇదే విధంగా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అవాకులు చవాకులు పేలిన బీఆర్ఎస్ పార్టీకి ఇది చెంపపెట్టు అన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధితోనే ఈ విజయం సాధ్యమైందని, నిత్యం ప్రజల్లో ఉండే బీసీ బిడ్డ నవీన్‌యాదవ్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేవిధంగా రేవంత్‌రెడ్డి కృషి చేస్తారని, ఇది బీసీలకు ఇచ్చిన అవకాశామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పల మహా పడిపూజ

వేంసూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపాడు గ్రామంలో అరవిందో ఫార్మాకంపెనీ వైస్ ప్రెసిడెంట్ నాగులవంచ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అయ్యప్పల మహాపడిపూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గురుస్వామి మేలుతంత్రి బ్రహ్మశ్రీ చంద్రమౌళి వెంకటేష్‌శర్మ, గురుస్వామి ద్రోణంరాజు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో అయ్యప్పల మహాపడిపూజ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వాముల శరణ ఘోషతో యర్రగుంటపాడు గ్రామం మారుమోగింది. యర్రగుంటపాడు గ్రామంతోపాటు పరిసర గ్రామాల నుంచి తరలి వచ్చిన అయ్యప్పమాలధారణ భక్తులతో ప్రాంగణం కోలాహలంగా మారింది. ఈ మహాపడిపూజ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. అయ్యప్పలు 40రోజుల నిష్ఠగా పూజలు చేయటం ద్వారా స్వామివారి అనుగ్రహం పొందాలన్నారు. అయ్యప్పస్వామి దయతో ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఇతరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రేవంత్‌రెడ్డిని కలిసిన వైరా ఎమ్మెల్యే


రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించిన సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత 15రోజుల నుంచి జూబ్లీ హీల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలిచిన వెంటనే సీఎం క్యాంపు కార్యాలయంలో రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కలిసి శాలువాతో సన్మానించారు. సీఎంతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కూడా క్యాంపు కార్యాలయంలోకలిశారు. ఎమ్మెల్యేతోపాటు కొత్తగూడెం, వైరా నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ(చిన్ని), నాగ సీతరాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, పమ్మి అశోక్, బోడ గణేష్ పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మనోహర్

మధిర రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధిర కోర్టు భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వరంగల్ సర్కిల్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మనోహర్, ఈఈ రమాదేవి ఆదేశించారు. మధిరలో రూ.24కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కోర్టు భవన పనులను శుక్రవారం వారు సందర్శించి పరిశీలించారు. భవన నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించారు. నాణ్యతతో నిర్మించాలని, వాటర్ క్యూరింగ్ తప్పకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఖమ్మం డివిజన్ డీఈ సూరిబాబు, సత్తుపల్లి ఏఈఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డీఈ తానేశ్వరరావు ఏఈ రాంబాబు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన పోతురాజు కథలు: ఎంఈవో

సత్తుపల్లిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థి పోతురాజు రచనలు ప్రతిఒక్కరినీ ఆలోచింపజేశాయని సత్తుపల్లి ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోతురాజుతోపాటు అతని తల్లిదండ్రులు తిరుపతమ్మ, యాకయ్యలను గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలోనే పోతురాజు ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు రమాదేవి, ఆర్థిక సహాయం అందించిన ముదుంబై రామానుజాచార్యులు, ట్రస్ట్ బాధ్యులను అభినందించారు. నైతిక విలువలు, సామాజిక, సందేశాత్మక విషయాలతో పాటు వర్తమాన సంఘటనలు కూడా కథలుగా రూపుదిద్దుకున్నాయని, వీటిల్లో ఓటు నోటు, చెరువు చోరీ, నాన్నే నా హీరో, మా పల్లె వంటి కథలు అద్భుతమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సోందు, ఉపాధ్యాయులు, ట్రస్ట్ బాధ్యులు పాల్గొన్నారు.

సిరిపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వైరా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామంలో శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆత్మకమిటీ ఛైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, ఏవో మయాన్ మంజూఖాన్ ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ మచ్చా నర్సింహారావు, ఏఈవోలు వెంపటి కీర్తి, ఎస్.సైదులు, సెంటర్ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కిరణ్ పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మట్టూరి వెంకటేశ్వరరావు

ట్రాన్స్‌కో వైరా డీఈగా చిన్నబాబూరావు

వైరా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైరా ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్(ఎఫ్ఏసీ)గా వి.చిన్నబాబూరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం ఎస్ఈ కార్యాలయంలో టెక్నికల్ డీఈగా పనిచేస్తున్న చిన్న బాబూరావు వైరా డీఈగా నియమితులయ్యారు. ఇప్పటివరకు వైరా డీఈగా పనిచేసిన బండి శ్రీనివాసరావు నూతనంగా ఏర్పడిన మధిర డివిజన్ కార్యాలయ డీఈగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా చిన్నబాబూరావు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఖమ్మం డీఈ ఎస్.రామారావు, వైరా ఏడీఈ పి.కిరణ్‌కుమార్, ఏఈలు పి.సుందర్‌కుమార్, పి.వెంకటసాయి డివిజన్ కార్యాలయ సిబ్బంది చిన్నబాబూరావుకు శుభాకాంక్షలు తెలిపారు.



రానున్న రోజుల్లో అఖండ భారతదేశాన్ని చూడబోతున్నాం

- బిహార్‌లో బీజేపీ విజయం పట్ల సత్తుపల్లిలో సంబరాలు

సత్తుపల్లిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రదాని నరేంద్రమోదీ సారథ్యంలో అఖండ భారతదేశాన్ని చూడబోతున్నామని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ.రమేష్‌లు అన్నారు. బీహార్‌లో బీజేపీ కూటమి విజయం సాధించడం పట్ల సత్తుపల్లి రింగ్ సెంటర్‌లో ఆపార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం బాణాసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, ఎంత పోరాడినా న్యాయాన్ని, ధర్మాన్ని కాపాడేది, ఈ దేశాన్ని రక్షించేది నవభారత నిర్మాత మోదీయేనన్నారు. ప్రపంచ దేశాలు మొత్తం మోదీ సారథ్యంలో పనిచేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారని, బీహార్‌లో విజయం అందించిన అక్కడి ప్రజలకు సత్తుపల్లి నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, బాణోత్ విజయ్, నరేష్, సాలి శివ, నాగ సురేందర్, ఆచంట నాగస్వామి, మందా శివ, రహ్మతుల్లా పాల్గొన్నారు.

తల్లాడ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడంతో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లాడలో ఆ పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి నాయకులు ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. బీజేపీ జిల్లా నాయకుడు అపతి వెంకటరామారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు చల్లా నాగులు, రాయల రమేష్, వాడపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సత్తుపల్లిలో మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ శ్రేణులు

గంటలో ఇంటి నిర్మాణ అనుమతి

వైరా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పదోవార్డు పరిధిలోని గండగలపాడులో కాటి కృష్ణ అనే దరఖాస్తు దారుడికి కేవలం ఒక్క గంట వ్యవధిలోనే ఇంటి నిర్మాణానికి మునిసిపల్ కమిషనర్ ఉప్పల గురులింగం అనుమతి ఇచ్చారు. బిల్డ్ నౌ వెబ్‌సైట్‌లో ఇంటి నిర్మాణానికి కృష్ణ దరఖాస్తు చేసుకున్నాడు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తు మేరకు మునిసిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి భాస్కర్‌తో కలిసి ఇంటి నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఆ వెంటనే దరఖాస్తు, డాక్యుమెంట్లతో సరిపోల్చుకొని ఇంటి నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. ఇంటి నిర్మాణ అనుమతులు వేగంగా పారదర్శకంగా ఇస్తున్నామని, అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేయవద్దని తెలిపారు. అనుమతులు లేని నిర్మాణాలకు జరిమానా విధించటంతోపాటు నిర్మాణాలు తొలగిస్తామని కమిషనర్ హెచ్చరించారు.


దరఖాస్తును పరిశీలిస్తున్న కమిషనర్